బిఇడి సెమిస్టర్ ప్రశ్నాపత్రంలో తప్పిదం

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన బిఇడి సెమిస్టర్ ప్రశ్నాపత్రంలో మార్కుల విషయంలో తప్పిదం చోటుచేసుకుంది. 40 మార్కులకు గానూ ప్రశ్నాపత్రం ఉండాల్సి ఉండగా, 80 మార్కులకు ఇవ్వడంతో అభ్యర్థులు షాక్ అయ్యారు. ఉదయం పది నుంచి 11.30 గంటల వరకు గంటన్నర పరీక్షా సమయం కాగా, 80 మార్కులకు అదే సమయం ఇవ్వడంతో తప్పిదాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తప్పిదాన్ని గుర్తించిన అధికారులు సరిచేసేందుకు అవకాశం లేకపోవడంతో నిర్దేశిత సమయంలోనే పరీక్షను రాయించారు. ఈ విషయంపై వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ఎస్.ఉదయ్ భాస్కర్ వివరణ కోరగా, బిఒఎస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

బరిలో 10 మంది

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో పదిమంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు నామినేషన్ల ఉపసంహరణ అనంతరం నామినేషన్లు వేసిన పదిమందిలో ఏ ఒక్కరూ ఉపసంహరించుకోలేదు. దీంతో అభ్యర్థులందరూ పోటీలో ఉన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, పిఆర్‌టియు బలపరిచిన అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, బహుజన సమాజ్ పార్టీ బలపరిచిన పెదపెంకి శివప్రసాద్‌తోపాటు కోసూరు రాధాకృష్ణ, సత్తలూరి శ్రీరంగ పద్మావతి, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, పోతల దుర్గారావు, సుంకర శ్రీనివాసరావు పోటీలో ఉన్నారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు

ఏర్పాట్లు పూర్తి

వివరాలను వెల్లడిస్తున్న రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్ హరేంధిరప్రసాద్

- రిటర్నింగ్ అధికారి ఎంఎన్.హరేంధిరప్రసాద్
- బరిలో 10 మంది అభ్యర్థులు
- 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

ఉత్తరాంధ్రలోని విశాఖపట్టణం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు ఫిబ్రవరి 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. విశాఖ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ విడుదల చేశామని, అదే రోజు నుంచి నామినేషన్లను స్వీకరించినట్లు తెలిపారు. 10వ తేదీ నాటికి నామినేషన్ల స్వీకరణ పూర్తయిందని, మొత్తం 10 మంది అభ్యర్థుల నుంచి 20 నామినేషన్లు స్వీకరించినట్లు చెప్పారు. పరిశీలన అనంతరం నాలుగు నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పదిమంది అభ్యర్థులు బరిలో ఉన్నారని, ఎవరూ నామినేషన్‌ను వెనక్కి తీసుకోలేదని వెల్లడించారు.

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరు జిల్లాల్లో 123 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని మౌలిక సదుపాయాలు, సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ ఎన్నికలలో 22,493 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పురుష ఓటర్లు 13,508, మహిళా ఓటర్లు 8,985 మంది ఉన్నారని పేర్కొన్నారు. విశాఖపట్టణంలో 13, అనకాపల్లిలో 24, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 11, విజయనగరంలో 29, పార్వతీపురం మన్యంలో 15, శ్రీకాకుళంలో 31 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని వివరించారు.

ప్రతి పోలింగ్ కేంద్రంలో నలుగురు సిబ్బంది ఉంటారని, వారికి ఇప్పటికే రెండు రౌండ్ల శిక్షణ అందించినట్లు తెలిపారు. ఓటు వేసే అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం స్లిప్పులు అందజేస్తామని, పోలింగ్ కేంద్రంలో గుర్తింపు కార్డును చూపించి స్లిప్పులు పొందాలని సూచించారు. పోలింగ్‌కు 48 గంటల ముందు అనగా ఫిబ్రవరి 25 సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎటువంటి ప్రచారం చేయరాదని తెలిపారు. మార్చి 3వ తేదీన ఉదయం 8 గంటల నుంచి కౌటింగ్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ బ్లాక్‌లో కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నామని, దీనికి ఎన్నికల కమిషన్ అనుమతి రావాల్సి ఉందని పేర్కొన్నారు. మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని చెప్పారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని, వివిధ స్థాయి అధికారులతో కూడిన 12 ఎంసిసి బృందాలను నియమించామని, మండలానికి ఒకటి చొప్పున 11 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

నేర చరిత్ర లేని వారిని ఏజెంట్లుగా నియమించుకోవాలి

ఎటువంటి నేరచరిత్ర లేని వారిని పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లుగా నియమించుకోవాలని అభ్యర్థులకు రిటర్నింగ్ అధికారి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉద్యోగాలు చేస్తున్న వారిని, రాజకీయ పదవులు ఉన్నవారిని నియమించుకోరాదని స్పష్టం చేశారు. ప్రచారం విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, కరపత్రాలపై ప్రింటర్, పబ్లిషర్ వివరాలను పొందుపరచాలని సూచించారు. నమూనా బ్యాలెట్ పత్రాలను రూపొందించుకునేటప్పుడు నిబంధనలు పాటించాలని చెప్పారు. జాతీయ జెండా, మతం, కులాన్ని ప్రతిబింబించేలా ఎలాంటి పత్రాలను రూపొందించకూడదన్నారు. పోలింగ్ కేంద్రంలో అధికార యంత్రాంగం ఏర్పాటుచేసిన వైలెట్ కలర్ పెన్నును ఉపయోగించి ఓటరు తనకు నచ్చిన వ్యక్తికి ఎదురుగా సంబంధిత రోమన్ లేదా ఆంగ్ల నెంబరు వేయాలని సూచించారు. ఎలాంటి రాతలు రాయకూడదని, టిక్ మార్కులు పెట్టరాదని, అలా చేస్తే ఓటు చెల్లదని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలపై అభ్యర్థులు ఓటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి, ఎఆర్ఒ బిహెచ్.భవానీ శంకర్, ఎన్నికల సెల్ అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

అభ్యర్థులు సహకరించాలి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని, ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని రిటర్నింగ్ అధికారి, విశాఖపట్టణం జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. గురువారం సాయంత్రం నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ గడువు ముగిసిన వెంటనే పోటీలో ఉన్న అభ్యర్థులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకంలో, ప్రచారంలో, అనుమతుల విషయంలో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. వాహనాలు, కరపత్రాల ముద్రణ, ప్రచారం వంటి అంశాలకు సంబంధించిన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ విండో డెస్క్ ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఇతర జిల్లాల్లో నిర్వహించబోయే ర్యాలీలు, ప్రచారాలకు సంబంధించి ఆయా జిల్లాల ఎన్నికల అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ రెండు జిల్లాల సరిహద్దులో ఏదైనా కార్యక్రమం నిర్వహించాలన్నప్పుడు తనను సంప్రదించాలని సూచించారు.

విజయగౌరి

శ్రీనివాసులునాయుడు

రఘువర్మ

ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ముగిసిన

నామినేషన్ల ఘట్టం

- బరిలో 10 మంది
- పోటీ ఆ ముగ్గురు మధ్యే
- యుటిఎఫ్ నుంచి పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల విజయగౌరి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోటీకోసం అభ్యర్థులకు నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం గురువారం సాయంత్రంతో ముగిసింది. నామినేషన్లను దాఖలు చేసిన వారిలో ఏ ఒక్కరూ ఉపసంహరించుకోకపోవడంతో బరిలో 10 మంది అభ్యర్థులు నిలిచారు. ఐతే ప్రధాన పోటీ మాత్రం ముగ్గురు అభ్యర్థుల మధ్యే ఉంటుందని ఊహాగానాలు సాగుతున్నాయి. ఫిబ్రవరి 3 నుంచి 10వ తేదీ వరకూ నామినేషన్ల దాఖలు కార్యక్రమం విశాఖ జిల్లా కలెక్టరేట్ కేంద్రంగా జరిగింది. టీచర్ ఎమ్మెల్సీ బరిలో ఉన్న అభ్యర్థుల కోసం ఈనెల 27న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ పోలింగ్ జరుగనుంది. 22,493 మంది టీచరు ఓటర్లున్నారు.

పోటీ ఆ ముగ్గురి మధ్యే...

యుటిఎఫ్ అభ్యర్థిగా ప్రోగ్రెసివ్ డెమక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) బలపరచిన కోరెడ్ల విజయగౌరి ఉత్తరాంధ్ర ప్రాంతంలో పలు ప్రజాతంత్ర, ఉపాధ్యాయుల సమస్యలపైనా ఉద్యమాలు చేపట్టిన మహిళగా అందరిలోనూ మంచి గుర్తింపు పొందారు. ప్రభుత్వ, ప్రయివేటు స్కూల్స్‌లో సమస్యల అధ్యయనం, ప్రభుత్వాల విధానాల వల్ల విద్యారంగానికి జరగబోయే కష్ట, నష్టాలపై పలుమార్లు ఉత్తరాంధ్ర స్థాయిలో గొంతెత్తిన చరిత్ర ఆమెకు ఉంది. రాష్ట్రంలోనే పిడిఎఫ్ అభ్యర్థులందరూ ఉద్యమాభిలాషతో ముందుకు సాగిన వారే అయినందున టీచర్ల నుంచి ఈమెకు మంచి స్పందన లభిస్తోంది. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ బరిలో పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసులనాయుడు శాసన మండలి సభల్లో ఉపాధ్యాయుల తరపున గొంతెత్తాల్సిన వీరు పాలక పక్షాలకు భజన చేస్తూ 'ఇద్దరూ ఇద్దరే' అనేలా వ్యవహరించడం టీచర్లందరిలోనూ తాజాగా చర్చ సాగుతోంది. ప్రస్తుత ఎన్నికల్లో 'కూటమి పార్టీల మద్దతు నాకంటే నాకు అనుకుంటూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీని సైతం వీరు రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా పోటీ పడి ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారికి వత్తాసుగా నిలవడమే వ్యాపకంగా మారిపోయింది. జాతీయ విద్యావిధానం పేరుతో ఢిల్లీ నుంచి రాష్ట్రాల విద్యాహక్కులను, విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేస్తున్న బిజెపికి చెందిన విశాఖ నాయకుడు పివిఎన్.మాధవ్ ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా నిలబడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో మోడీ విధానాల అడుగులకు మడుగులొత్తుతూ విద్యా వ్యవస్థను కలుషితం చేసేందుకు సిద్ధమైన టిడిపి తరపున పట్టభద్రుల ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు రఘువర్మకు మద్దతుగా నిలిచారు. పిడిఎఫ్ అభ్యర్థుల ఉద్యమ స్ఫూర్తితో కోరెడ్ల విజయగౌరి ముందుకు సాగుతున్నారు.

భారీగా పట్టుబడిన మద్యం సీసాలు

భారీగా మద్యం పట్టివేత

ఇచ్ఛాపురం: మండలంలోని కొఠారి పంచాయతీ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 1752 మద్యం సీసాలను పట్టుకున్నామని రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. దీని విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని అన్నారు. ఎస్పి ఆదేశాలు మేరకు అక్రమ మద్యం రవాణా అమ్మకాలపై గట్టి నిఘా పెట్టామన్నారు. అందులో భాగంగా బుధవారం అర్ధరాత్రి కొఠారి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నామని అన్నారు. కృష్ణ మద్యం షాపు నుంచి కాపాసుకుద్దికి చెందిన బాబూరావు, కాళిదాసులు మద్యం కొనుగోలు చేసుకుని రెండు వాహనాల్లో తరలిస్తున్నారని అన్నారు. తనిఖీలో ఎటువంటి రసీదులు లేకపోవడంతో వాహనాలను సీజ్ చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులను అరెస్టు చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేపడితే షాపు లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు.

జీవన ధ్రువపత్రాన్ని సమర్పించాలి

శ్రీకాకుళం: ఈ ఏడాది జనవరికి ముందు ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులు, ఖజానా కార్యాలయంలో పెన్షన్ తీసుకుంటున్న పెన్షనర్లు వారి లైఫ్ సర్టిఫికేట్‌ను ఈనెల 28వ తేదీ లోగా సమర్పించాలని జిల్లా ఖజానాశాఖ ఉప సంచాలకులు సిహెచ్.రవికుమార్ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా స్థానిక డివిజనల్ కార్యాలయంలో గురువారం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు వారి లైఫ్ సర్టిఫికేట్‌ను నేరుగా ఖజానా కార్యాలయంలో గానీ, జీవన ప్రమాణ్ ప్రభుత్వ యాప్‌లో గానీ సమర్పించాలని చెప్పారు. లేకుంటే పెన్షన్ నిలిచిపోతుందని తెలిపారు. ఉప ఖజానాధికారులు సిహెచ్.రామారావు, వై.సూర్యారావు, తనిఖీ సిబ్బంది బి.కృష్ణారావు, ఎస్‌టిఒ బి.శ్రీధర్ పాల్గొన్నారు.

భోజన మెనూను పరిశీలిస్తున్న ఎపిఒ చిన్నబాబు

ఉత్తీర్ణతా శాతం పెంచాలి

ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు

శ్రీకాకుళం: సీతంపేట ఐటిడిఎ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని పెంచాలని ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అన్నారు. నగరంలోని బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ డీడీ అన్నదొరతో కలిసి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల్లో వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టిసారించి, ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. పునశ్చరణ తరగతులపై దృష్టిసారించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి బాగా చదివి, పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల భోజన మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు కార్మికుల ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - మందస

ఛార్టర్ ఆఫ్ డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్మికులు చేపడుతున్న సమ్మె మూడు రోజులకు చేరుకుంది. సమ్మెలో భాగంగా గురువారం మండలంలోని ఆర్.కె పురం, సిద్ధిగాంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. వేతన సవరణ చేయాలని, డిమాండ్లను నెరవేర్చాలని ర్యాలీ పొడవునా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ కె.కేశవరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ యాజమాన్యాలకు డిమాండ్ నోటీసు ఇచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా స్పందన లేదని విమర్శించారు. వేతన సవరణ చేయకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. యాజమాన్యాల మొండివైఖరి వల్లే కార్మికులు అనివార్యంగా సమ్మెకు దిగాల్సి వచ్చిందని చెప్పారు. యాజమాన్యాలు కార్మిక చట్టాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా యని విమర్శించారు. కార్మికశాఖ అధికారులు జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉధృత పోరాటం తప్పదని హెచ్చరించారు. జీడి కార్మిక సంఘం నాయకులు సిహెచ్.చంద్రావతి, గుసిరి బాలమ్మ, బాడ వెంకటమ్మ, తదితరులు సంఘీభావం తెలిపారు. రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు టి.లక్ష్మీనారాయణ, కె.బాలకృష్ణ, పి.కూర్మారావు, బి.దుర్యోధన, ఆర్.ఏకాశి, ఆర్.తేజ, కడమటి దాలమ్మ, మడ్డు మహాలక్ష్మి పాల్గొన్నారు.

వికలాంగులను గుర్తించాలి

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఇంటింటా సర్వే ద్వారా వికలాంగ బాలబాలికలను గుర్తించాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశించారు. జిల్లా కోర్టు భవనంలో వైద్య, వికలాంగ సంక్షేమ, రెవెన్యూ, ఐసిడిఎస్, విద్యా, డిఆర్‌డిఎ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 19 ఏళ్ల లోపు వికలాంగులను గుర్తించడం ద్వారా వారికి అవసరమైన వైద్య పరికరాలు, చికిత్సను అందించే అవకాశం ఉంటుందన్నారు. వారి స్థితిగతులను తెలుసుకోవడం వల్ల మెరుగైన వైద్య సదుపాయం అందేలా చూడొచ్చని చెప్పారు. ఇందుకుగానూ క్షేత్రస్థాయి నుంచి పనిచేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, వికలాంగ సంక్షేమశాఖ ఎడి కవిత, ఐసిడిఎస్ పీడీ శాంతిశ్రీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోగితో మాట్లాడుతున్న పిఒ యశంత్‌కుమార్ రెడ్డి

మెరుగైన వైద్యం అందించాలి

సీతంపేట ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- కొత్తూరు

వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యం అందించాలని పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డుల్లోని రోగులకు అందుతున్న వైద్యంపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రికి రోగులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన వైద్యాధికారి ధర్మాన కిశోర్‌కుమార్‌కు ఆదేశించారు. ఆస్పత్రిలో బయో వ్యర్థాలు లేకుండా చూసుకోవాలని అన్నారు. అనంతరం వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈయన వెంట వైద్యులు రామకృష్ణ అనూష, స్నేహ సిబ్బంది ఉన్నారు.

సిక్కోలులో 'తండేల్' సందడి

- కోడి రామ్మూర్తి స్టేడియంలో థాంక్యూమీట్
- స్టెప్పులతో అలరించిన నాగచైతన్య, సాయిపల్లవి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అరసవల్లి

తండేల్ సినీ యూనిట్ శ్రీకాకుళం నగరంలో సందడి చేసింది. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో గురువారం నిర్వహించిన తండేల్ థాంక్యూ మీట్‌కు చిత్ర బృందం తరలివచ్చింది. ఆ చిత్ర హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయిపల్లవి చిత్రంలోని హైలస్సో... హైలస్సా, నమో నమ:శివాయ పాటలకు స్టెప్పులు వేసి అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో నాగచైతన్య మాట్లాడుతూ శ్రీకాకుళంతోనే తండేల్ కథ ప్రయాణం ప్రారంభమైందన్నారు. ఈ కథ విన్న తర్వాత మత్స్యకారుల జీవన శైలిని చూడడానికి డి.మత్స్యలేశం గ్రామంలో పర్యటించానని చెప్పారు. ఈ సినిమాలో తనకు ఇష్టమైంది, కష్టమైంది శ్రీకాకుళం యాసే అని అన్నారు. శ్రీకాకుళం జిల్లాకు రావడం, ఈవిధంగా అభిమానులు, ప్రేక్షకులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. నటి సాయిపల్లవి మాట్లాడుతూ మత్స్యకారులు పాకిస్థాన్ జైల్లో ఉండడం, వారి కష్టాలను రెండున్నర గంటల్లో సినిమాగా తీయడం మామూలు విషయం కాదన్నారు. ఈ సినిమాలో తను నటించడం ఆనందంగా ఉందన్నారు. సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు డైరెక్టర్ చందూ మొండేటి, నిర్మాత బన్నీ వాసు కృతజ్ఞతలు తెలిపారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ ఈ సినిమా కథపై తొలి నుంచీ చాలా నమ్మకంతో ఉన్నామని, అందరికీ కనెక్ట్ అవుతుందని భావించామన్నారు. కోడిరామ్మూర్తి జీవితం ఆధారంగా సినిమా గాని, వెబ్ సిరీస్ గాని ఎప్పటికైనా చేస్తానన్నారు. అనంతరం జిల్లా పోలీసు శాఖ రూపొందించిన యాంటీ డ్రగ్స్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కథా రచయిత కార్తీక్ తీడ, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నటుడు నాగచైతన్య, పక్కన సాయిపల్లవి

ప్రచారం చేస్తున్న విజయగౌరి

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి విజయగౌరి

ప్రజాశక్తి - కొత్తూరు

విద్యారంగ పరిరక్షణకు, ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో పోరాడతానని పిడిఎఫ్ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్ పేట మండలాల్లో పలు ప్రభుత్వ పాఠశాలలు, కెజిబివిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈనెల 27న నిర్వహించనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులు, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి, కెజిబివిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయుల మినిమం టైమ్ స్కేలు, ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యా సంస్కరణల ఫలితంగా వేలాది ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయని విమర్శించారు. దీనివల్ల సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, పాఠశాల సహాయకుల పోస్టులు మిగలనున్నాయన్నారు. తద్వారా భవిష్యత్ నియామకాలు, ప్రమోషన్లు కష్టంగా మారనున్నాయని తెలిపారు. తన 34 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసులో ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తూ ఉద్యమాలతోనే నడిచానని గుర్తుచేశారు. తనను గెలిపించి శాసనమండలికి పంపిస్తే మండలిలో ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకునవుతానన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, జి.శ్రీరామచంద్రమూర్తి, మహిళా నాయకులు డి.స్వర్ణలత, ఆర్.జ్యోతి, ఎన్.లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన పెండింగ్ కేసుల దర్యాప్తు

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - కొత్తూరు

పెండింగ్ కేసుల దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి పరిష్కరించాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా కొత్తూరు పోలీస్‌స్టేషన్‌ను గురువారం పరిశీలించారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి, నమోదైన కేసులపై ఆరా తీశారు. గ్రామ మహిళా పోలీసులతో మాట్లాడుతూ ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటించి, గ్రామీణ ప్రజానీకంతో మమేకమై సంకల్పం పేరిట మహిళలు, చిన్నారులపై జరిగే దాడులు, గంజాయి తదితర మత్తు పదార్థాలు వినియోగం వల్ల అనర్థాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అక్రమ మద్యం, నాటుసారా, గంజాయి వంటి మాదకద్రవ్యాలు రవాణా లేకుండా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గస్తీ నిర్వహణను పటిష్టం చేస్తూ నేర నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాపర్టీ నేరాలను ఛేదించాలని సూచించారు. వృత్తి నైపుణ్యత, సాంకేతికత జోడించి ఇంకా మెరుగైన పోలీసు సేవలను ప్రజలకు అందించాలని సూచించారు. సంకల్పం కార్యక్రమం ద్వారా గంజాయి వినియోగం, సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టి నివారించాలని, పోలీస్‌స్టేషన్‌లో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని క్రైమ్ రేట్‌ను మరింత తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట టెక్కలి డిఎస్‌పి డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తి, కొత్తూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎస్ఐ మహ్మద్ అమిర్ ఆలీ ఉన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న విప్ అశోక్

మెరుగైన సేవలు అందించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. పట్టణంలో డాక్టర్ దళ్లి సురేష్‌రెడ్డి, సత్తి నాగరమ్యలు ఆధునాతనమైన సౌకర్యాలతో ఏర్పాటు చేసిన డిఎస్ఆర్ ఆస్పత్రిని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోగులకు మంచి సేవలు అందించేటప్పుడు ఆస్పత్రి అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు చేతులమీదుగా వివిధ విభాగాలు ప్రారంభించారు. కార్యక్రమంలో విశ్రాంతి డిప్యూటీ సివిల్ సర్జన్ మోహన్‌రావ్, డాక్టర్లు నిమ్మన దాసు, నర్తు శేషగిరి, టిడిపి నాయకులు సాలీనా ఢిల్లీ, నందిక జాని, ఆశి చిరంజీవులురెడ్డి, వైసిపి నాయకులు చాట్ల తులసీదాస్ రెడ్డి, దేవదాస్‌రెడ్డి, ఆదిరెడ్డి, ప్రత్తి అన్వేష్, రాజారెడ్డి, బిట్టిబాబు పాల్గొన్నారు.

కొల్లిపాడులో ఉన్న టిడిపి బ్యానర్

ఎన్నికల కోడ్ వర్తించదా?

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

ఫిబ్రవరి 3న జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. కానీ, మండలంలోని లక్కీవలస, బోరుభద్ర సచివాలయ సిబ్బందికి ఎన్నికల కోడ్ వర్తించనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన వెంటనే మండలంలో ఎటువంటి రాజకీయ పోస్టర్లు, జెండాలు ఉండకూడదని నిబంధన ఉంది. కానీ, ఇక్కడి సచివాలయ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తుంది. కొల్లిపాడులో టిడిపి బ్యానర్, లక్కీవలసలో టిడిపి జెండాలు, బోరుభద్ర పంచాయతీ గోదలాంలో జనసేన బ్యానర్లు కనిపిస్తున్నాయి. వీటిని తొలగించకుండా నిద్రమత్తులో ఉన్నారా? అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చి 11 రోజులు అవుతున్నా బ్యానర్లు తొలగించకపోవడంలో అంతరిమియంతో అధికారులకు తెలియాలని ప్రజలు ఆరోపిస్తున్నారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు మరో అవకాశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా బిసి కార్పొరేషన్ రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించేందుకు మరో అవకాశం కల్పించనున్నట్లు టిడిపి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. బిసి కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాల కోసం (సబ్సిడీ రుణాలు) అర్హులైన సభ్యులు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12న ఆఖరు తేదీ అని అధికారులు ప్రకటించారు. అయితే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా జిల్లాలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు సభ్యులు ప్రయత్నించగా ఆన్‌లైన్‌లో సైట్ ఓపెన్ కాకపోవడంతో దరఖాస్తు చేసుకునే సభ్యులు ఆందోళన చెందుతున్నారు పేర్కొన్నారు. ఫిబ్రవరి ఆఖరి వారంలో ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తికానున్నాయి, మార్చి మొదటి వారంలో బిసి కార్పొరేషన్ రుణాలు ఆగిన జిల్లాల్లో ఆన్‌లైన్‌లో తిరిగి ఓపెన్ కావడం జరుగుతుందని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కొత్తగా రుణాల కోసం దరఖాస్తు చేసుకునే సభ్యులు కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, రేషన్‌కార్డు సర్టిఫికెట్, లేబర్ లైసెన్స్ సర్టిఫికెట్లను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు.

స్పీకర్‌తో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఈశ్వరరావు

లోక్‌సభ స్పీకర్‌ను కలిసిన ఎన్ఇఆర్

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

కేంద్ర విమానయానశాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు న్యూఢిల్లీలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కేంద్రమంత్రిని కోరారు. నియోజకవర్గ పరిధిలో నెలకొన్న పలు సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని అందజేశారు. అదే విధంగా న్యూఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాస్‌లో లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను విజయ నగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకర్గాలపై స్పీకర్‌తో మాట్లాడారు.

ఇళ్లస్థలాలు ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి- పలాస

పారిశుధ్య కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇప్పించేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, టి.రవిశంకరుగుప్తా, డొక్కరి శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రేడియో దినోత్సవం

శ్రీకాకుళం: ప్రపంచ రేడియో దినోత్సవ వేడుకలు గురువారం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రేడియో మాధ్యమ ప్రాధాన్యతను నేటి తరం యువతకు, ప్రజలకు అన్నివర్గాల వారికి తెలియజేసేందుకు ఈ దినోత్సవాన్ని జరుపుకున్నామని వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 102 మాజీ గవర్నర్ జి. ఇందిరాప్రసాద్, పి.జి.గుప్తా, బి.వి రవిశంకర్‌లు అన్నారు. ఒకప్పుడు రేడియో మనిషి జీవితంలో అంతర్భాగంగా నిలిచిందన్నారు. మనిషి ఆనంద, విషాద సమయంలో పాలుపంచుకునే ఆప్త బంధువు రేడియో అని కొనియాడారు. వార్తలను, వినోదాన్ని పంచే ఏకైక సాధనం రేడియో మాత్రమేనని స్పష్టం చేశారు. మనదేశంలో తొలిసారిగా రేడియో ప్రసారాలు 1923 నుంచి ప్రారంభం అయినా 1936లో ఇండియన్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీను ఆలిండియా రేడియోగా మార్చారని చెప్పారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు శాసపు జోగినాయుడు, ఎస్.సంజీవరావు, వూన్న నాగభూషనరావు, న్యాయవాది సత్యనారాయణ, గుడ్ల జగ్గారావు, గుడ్ల గోపాలరావు, మామిడి రాంబాబు, పొట్నూరు నాగేశ్వరరావు, జెసి పట్నాయక్, గురు ఆనందరావు, మెట్ట దనుంజయ, కృష్ణమూర్తి, మల్లిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వాకర్స్ ప్రతినిధులు

విజయగౌరి గెలుపు విద్యారంగ అభివృద్ధికి తోడ్పాటు

కవిటి : ప్రచారం చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- మందస

యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని సత్యసాయి జిల్లా, అనంతపురం జిల్లాల నుంచి ఎన్నికల ప్రచారానికి వచ్చిన యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్.జయ చంద్రారెడ్డి, వి.కోటేశ్వరప్ప, జిల్లా కార్యదర్శి గున్న రమేష్, రాష్ట్ర కౌన్సిలర్ గుంట కోదండరావు, అకడమిక్ సెల్ కో-కన్వీనర్ కంచరాన మాధవరావు పిలుపునిచ్చారు. మండలంలోని హరిపురం, మందస, బి.ఎస్.పురం, పి.ఎస్.పురం, కృష్ణాపురం, బహడపల్లి బేతాళపురం, లోహరి బంధ, అంబుగాం ఉన్నత పాఠశాలలు, పట్టులోగాం, చిన్నకోష్ట, జిటి, కిలోయి ఆశ్రమ పాఠశాలల్లో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2007లో శాసనమండలి పునరుద్ధరించారని అన్నారు. ఆ తర్వాత గెలుపొందిన ఎమ్మెల్సీలు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్)గా ఏర్పాడ్డారని అన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రయివేట్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులు, పింఛనుదారులు, నిరుద్యోగుల సమస్యలపై శాసన మండలిలో, వెలుపలా పోరాటాలు చేసినట్లు వివరించారు. ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి అనేక సమస్యలు పరిష్కరించినట్లు చెప్పారు. కెజిబివి, గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలు, అప్రెంటిస్ విధానం రద్దు, నోషనల్ ఇంక్రిమెంట్లు, కాంట్రాక్టు అధ్యాపకుల మినిమం టైమ్ స్కేల్, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సర్వీస్ రూల్స్ పరిష్కారంలో సంఘాలకు అండగా నిలిచారని అన్నారు. విజయగౌరి 1990లో తాను ఉపాధ్యాయ వృత్తిలో చేరినప్పటి నుంచి ఉపాధ్యాయుల సంక్షేమానికి ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. ఆరున్నరేళ్ల తన ఉపాధ్యాయ ఉద్యోగాన్ని వదులుకొని వాలంటీర్ ఉద్యోగోన్నతి ప్రకటించి ఎన్నికల్లో పోటీ చేస్తుందని తెలియజేశారు. విద్యార్థి దశ నుంచి ఉద్యమాల్లో చురుకైన పాత్రను వహించారన్నారు. ఆమె గెలుపు విద్యారంగ అభివృద్ధికి తోడ్పాటు నిస్తుందని తెలిపారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జగదీష్ బడిత్య, దాసరి ఈశ్వరరావు పూర్వ మండల అధ్యక్షులు పిన్నింటి కొండలరావు పాల్గొన్నారు.

కవిటి: ఉత్తరాంధ్ర శాసనమండలి ఉపాధ్యాయ ఎన్నికల్లో కోరెడ్ల విజయగౌరిని గెలిపించుకుందామని యూటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు లండ బాబూరావు పిలుపునిచ్చారు. విజయగౌరికి మద్దతుగా మండలంలోని విద్యా సంస్థల్లో యూటిఎఫ్ నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వాలు చేస్తున్న విద్యారంగ సంస్కరణలతో పేద పిల్లలకు విద్య దూరమవుతుందని, రానున్న రోజుల్లో అనేక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటువంటి అనాలోచిత సంస్కరణలతో బడుగు బలహీన వర్గాల వారికి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సహాధ్యక్షుడు కె.దాలయ్య మాట్లాడుతూ కొరెడ్ల విజయగౌరిని గెలిపించుకుంటే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందని అన్నారు. రాష్ట్ర కౌన్సిలర్ పొందూరు అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మాతున్నాయి కానీ విధానాల్లో మార్పు రావడంలేదని అన్నారు. జిల్లా కార్యదర్శి మురళీప్రకాష్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా ఉద్యమం పోరాటంలో ఉన్న వ్యక్తి, అనేక ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించిన కోరెడ్ల విజయ గౌరికి మొదట ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు జగదీష్, సీతమ్ నాయుడు, అశోక్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మందస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ముమ్మరంగా రైతుల రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి- కవిటి

రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. వ్యవసాయ, ఉద్యానవనశాఖ సిబ్బంది గురువారం మండలంలోని కుసుంపురం, బల్లిపుట్టుగ గ్రామాల్లో పర్యటించి రైతుల వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎఒ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం కేటాయించనున్న 11 అంకెల సంఖ్య తప్పనిసరని, ప్రతి రైతూ తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. రాబోయే కాలంలో రైతులకు సంబంధించిన ప్రతి పథకం 11 అంకెల నంబరుతో ముడిపడి ఉంటుందని అన్నారు. రైతులు తమ వివరాలు స్థానిక సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఎఎలు జగదీష్, అన్వేష్ పాల్గొన్నారు.

రైతుల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

అవగాహన కల్పిస్తున్న సిఐ విజయకుమార్

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సిఐ అంబటి విజయకుమార్ అన్నారు. మండలంలోని చాకిపల్లిలో సైబర్ నేరాలపై, మత్తు పదార్థాలపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో ఎక్కువగా సైబర్ నేరాల బారిన యువత పడుతున్నారన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే పోలీసులు సాయం కావాలంటే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సైన్ బోర్డులు గమనిస్తూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు. వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మాజీ సభ్యులు పంగ వసంతకుమార్, మాజీ సర్పంచ్ పంగ తవిటియ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూతన పుస్తకావిష్కరణ

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల బిఎస్అండ్‌హెచ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సాయిబాబు నెయ్యిల 'ఎసెన్షియర్స్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్ సర్వీసెస్' పేరుతో పుస్తకాన్ని రాశారు. దీనిని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు గురువారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పుస్తకం వల్ల ప్రధానంగా ఎంబిఎ, బిబిఎం విద్యార్థులకు సులభతరంగా బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగంపై అవగాహన కల్పించేలా రచయిత ఈ పుస్తకాన్ని రచించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆరెండీ అసోసియేట్ డీన్ డాక్టర్ కె.వేణుగోపాల్, బిఎస్ఇండ్ హెచ్ విభాగాధిపతులు డాక్టర్లు ఎం.వి.రత్నమణి, ఎం.రమణయ్య, ఎంబిఎ విభాగాధిపతి బి.శివకుమార్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిధులు మంజూరు చేయాలని వినతి

ప్రజాశక్తి- పలాస

నిధులు విడుదల చేసి అసంపూర్ణంగా ఉన్న ఎన్‌జిఒ హోమ్ భవనాన్ని పూర్తి చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారిధిగా ఉంటూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు అందిస్తుంటారని అన్నారు. వీరి సౌకర్యార్థం ఎన్‌జిఒ హోమ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ అధ్యక్షులు బోనెల గోపాల్, సెక్రెటరీ బి.ఉపేందరరావు, వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ ఎస్.పాపారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస : కాశీబుగ్గలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యు.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి గాంధీనగర్ ఫీడర్ పరిదిలోని వచ్చే వేసవి దృష్ట్యాల లైన్లకు తగిలే చెట్టు కొమ్మలు, నిర్వహణ పనులు చేపడుతున్నామని అన్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కేటి రోడ్, ఎస్ఎండి వెనుక భాగం, గుణ్ణేశ్వర నగర్, పల్లివీధి, ఆంధ్రా బ్యాంకు లైన్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మందస : ఈ నెల 14న ఉదయం పది నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పలాస డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రంగోలు గేటు నుంచి కొండలోవ మీదుగా పెద్ద పోల్స్ వేస్తున్నామని, ఈ సందర్భంగా మండలంలోని విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

కవిటి: కవిటి ప్రాథమిక సహకార సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 28లోగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని సిఇఒ జానకిరావు ఒక ప్రకటనలో తెలిపారు. అప్పు తీసుకున్న రైతులు గడువు తేదీకి ముందుగానే ఏడు శాతం వడ్డీ చెల్లించి రుణాలు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. ఈ గడువు దాటితే 13 శాతం వడ్డీతో పాటు అసలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణాలు రెన్యువల్ చేసుకోవాల్సిన రైతులు తమ ఆధార్ కార్డు జిరాక్స్, 1బి జిరాక్స్, డిసిసిబి ఎకౌంట్, సెల్ నంబరుతో స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సంప్రదించాలని సూచించారు.

రూ.15,500కు లడ్డూ వేలం

పోలాకి: పోలాకిలోని కనకదుర్గా భవానీ జాతర మహోత్సవాలు సందర్భంగా ఆలయ ధర్మకర్తలు టంకాల శ్రీరాములు భవానీ, పల్లిరాజు భవానీలు గురువారం లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ పాటలో అనేక మంది యాత్రికులు పాల్గొన్నారు. కొత్తపేటకు చెందిన సురవరపు విష్ణు దంపతులు రూ.15,500కు పాట పాడి లడ్డూ కైవసం చేసుకున్నారు. అనంతరం ఆ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పోలాకి అయ్యభవానీ, సురవరపు సంతోష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లడ్డూను కైవసం చేసుకున్న విష్ణు దంపతులు

స్వయంశక్తి సంఘాలకు శిక్షణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పురపాలక సంఘం, మెప్మా ఆధ్వర్యాన ఉన్న స్వయం సహాయక సభ్యులకు, వారి కుటుంబ సభ్యులకు అందరికీ స్కిల్ డెవలప్‌మెంట్ కింద ఇంటర్న్‌షిప్ నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తీసుకున్న అభ్యర్థులకు ఆర్థికసాయం, సర్టిఫికేట్లు, స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ సమయంలో నెలకు రూ.3,500 చొప్పున స్టైఫండ్ ఏడాది వరకు ఇస్తామన్నారు. 2021 ఏప్రిల్ తరువాత డిగ్రీ చేసిన వారు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్‌కు డిగ్రీ, ఇంటర్, పదో తరగతి ధ్రువపత్రాలు, ఆధార్, బ్యాంకు పుస్తకం, ఫోన్ నంబరు, మెయిల్ ఐడి, ఫొటోతో ఈ నెల 20లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

వినతిపత్రం అందిస్తున్న శ్యాంప్రసాద్ రెడ్డి

కవిటి: కవిటిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీడాప్ మాజీ చైర్మన్ శ్యాం ప్రసాద్ రెడ్డి కోరారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తాను గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కవిటి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు అత్యవసరమని అన్నారు. కవిటి మండలం నుంచి ఎంతోమంది పిల్లలు డిగ్రీ చదువులకు బయటకు వెళ్తున్నారని, కొంతమంది బయటకు వెళ్లే స్తోమత మధ్యలో ఆపేస్తున్నారని తెలిపారు. దీనిపై డైరెక్టర్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

డిజిటల్ అసిస్టెంట్ల సంఘ మండల అధ్యక్షునిగా విజయ్

కవిటి: మండలం డిజిటల్ అసిస్టెంట్ల సంఘ మండల అధ్యక్షునిగా లోల్ల విజయ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశ మయ్యారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రెటరీగా గన్ని హరీష్, ట్రెజరర్‌గా బెండి వికాస్‌కృష్ణ, తోట జయదేవ్, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా దున్న నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరికి ఎంపిడిఒ కె.శ్రీనివాస్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రహి, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ అభినందించారు.

వర్క్‌షాపులు ప్రశ్నాపత్రాల తయారీ కేంద్రాలు కావాలి

సమావేశంలో మాట్లాడుతున్న రమణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెడుతున్న స్కూల్ కాంప్లెక్స్ వర్క్‌షాపులు పరీక్ష ప్రశ్నా పత్రాల తయారీ కేంద్రాలు కావాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ అన్నారు. గురువారం పట్టణంలోని మండల విద్యాశాఖ కార్యాలయంలో స్కూల్ కాంప్లెక్స్ వర్క్ షాపులపై చర్చా గోష్టి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాంప్లెక్స్ సమావేశాల కారణంగా రెండు పనిదినాల్లో ఉపాధ్యాయులు తరగతులకు దూరమయ్యేవారని నేడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కారణంగా ఒక్కపూట వర్క్‌షాప్ వలన ఒక్కపూటలోనే ఉదయం పాఠశాలకు వెళ్లడం మళ్లీ పాఠశాల నుంచి తిరిగి స్కూల్ కాంప్లెక్స్‌కు ఆదరా బాదరాగా రావడం ఎక్కువమంది విద్యార్థులు ఉన్నటువంటి ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజనాన్ని 11:30 లోపే ముగించడం కొంత కష్టం అయినప్పటికీ ఈ విధానం కొంతమేరకు సానుకూల ఫలితాలు వచ్చేందుకు అవకాశం ఉందన్నారు. రానున్న ఏడాది నుంచి పాఠశాల విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందుగానే స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల షెడ్యూల్ విడుదల చేసి విద్యార్థులకు పూర్తిగా ఉపయోగపడేలా ఆయా నెలల్లో వచ్చే ఫార్మేటివ్, సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షల ప్రశ్నాపత్రాలు తయారీ బోధనోపకరణాల తయారీ అలాగే నో బ్యాగ్ డే కార్యక్రమాలకు ఊతమిచ్చే సృజనాత్మక కృత్యాలు తయారీకి అనువుగా నూతన కాంప్లెక్స్ సమావేశాలు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోకుంటే ఇది కూడా ఒక విఫల ప్రయోగంగానే మిగిలిపోనుందన్నారు. ఈ చర్చా గోష్టిలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, హెచ్ సత్యం, బి.శ్రీను, ఎ.గోపి, ఎమ్.రమేష్, హెచ్ రామకృష్ణ పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

కోటబొమ్మాళి : మండలంలో ప్రస్తుతం బర్డ్‌ఫ్లూ వ్యాధి లక్షణాలు ఏమీ లేవని, ఒకే వేళ ఎవరికైన ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే కోటబొమ్మాళి పశువైద్య కేంద్రానికి సమాచారం ఇవ్వాలని వైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా స్థానికంగా ఉన్న చికెన్ సెంటర్‌ను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని సహాయ సంచాలకులు ఎం.లోకనాథం పర్యవేక్షణలో ఇద్దరు పశువైద్యాధికారులు రెండు టీమ్‌లుగా ఏర్పడి తనిఖీలు చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగా కోటబొమ్మాళి మండల కేంద్రంలోని చికెన్ సెంటర్లను సందర్శించి తనిఖీలు నిర్వహించి వారికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. బర్డ్‌ఫ్లూ వ్యాధి సోకిన కోళ్లకు అకస్మికంగా గుడ్ల ఉత్పత్తి తగ్గిపోతుందని, కోళ్లలో తల, కాళ్లు భాగాల్లో వాపు కనిపిస్తుందని అన్నారు. పలుచని పొరతో కూడిన పెంకు గల గుడ్లు పెడతాయని, ముక్కు నుంచి నీరు కారుతుందని అన్నారు. ఆకలి మందగిస్తుందని, ఊపిరి సక్రమంగా ఆడదని అన్నారు. ఈ లక్షణాలు కోళ్లలో కనిపిస్తే అది బర్డ్‌ఫ్లూ వ్యాధిగా గుర్తించాలన్నారు. ఈ వ్యాధి వలస పక్షుల ద్వారా ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నాయని అన్నారు. ఏదైనా కోడి చనిపోతే వెంటనే దాన్ని చుట్టూ విసర్జకాలు, వ్యర్థాలు, దాణా, నీరు తదితరాలన్నింటినీ దూరంగా తీసుకెళ్లి పూడ్చకుండా కాల్చాలన్నారు. కోళ్ల ఫారం నిర్వహించేవారు మీ ఫారం వద్దకు మనుషులు, వాహన దారులు రాకుండా చూడాలన్నారు. ఎండలు పెరిగితే ఈ వ్యాధి పూర్తిగా నమయవుతుందని చెప్పారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

చికెన్ సెంటర్లను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి కిరణ్‌కుమార్

చిన్నారిని బలిగొన్న చేగోడియం

ప్రజాశక్తి- రణస్థలం

సోనాక్షిత (ఫైల్)

మండలంలో దారుణ సంఘటన గురు వారం చోటు చేసుకుంది. చేగోడియం గొంతుకి అడ్డం పడి చిన్నారి మృతి చెందింది. మండ లంలోని లంకపేటలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా చర్చనీయా ంశమైంది. లంకపేటకు చెందిన కిల్లారి ఈశ్వరరావు, శ్రీదేవి దంపతులకు రెండేళ్ల వయసు గల సోనాక్షిత అనే కుమార్తె ఉంది. ఇంట్లో ఉన్న సమయంలో కుమార్తె మారం చేసింది. దీంతో తల్లి శ్రీదేవి కుమార్తెకు చేగోడి ఇచ్చింది. దానిని ఆ చిన్నారి సోనాక్షిత తింటుండగా ఆ చిన్నారి గొంతుకకు అది అడ్డంగా ఇరుక్కుంది. దీంతో కుటుంబ సభ్యులు ఆ చిన్నారిని చికిత్స కోసం రణస్థలం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తక్షణమే తరలించగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించి శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకు వెళ్లాలని సూచించారు. రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే సోనాక్షిత ఊపిరి ఆడక చని పోయింది. చిన్నారి కళ్లముందే చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. విషయం తెలుసుకుని ఇతర కుటుంబ సభ్యులతో పాటు బంధువులు ఇంటికి చేరుకుని లబోదిబోమంటున్నారు. ఈ సంఘటన సమాచారం తెలుసుకున్న వారంతా కంటతడి పెడుతున్నారు.

వృద్ధుడు అదృశ్యం

ప్రజాశక్తి- నౌపడ

నర్సింహమూర్తి

సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ సీతా నగరానికి చెందిన గండి నరసింహమూర్తి అలియాస్ చిన్న జగ్గయ్య అనే వృద్ధుడు బుధవారం అదృశ్యమయ్యాని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటల సమయంలో పలాస ఆస్పత్రికి వెళ్తానని సీతానగరంలో ఆర్‌టిసి బస్సు ఎక్కారని అన్నారు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో నౌపడ, పూండి, పలాస మార్గాల్లోను, తెలిసిన వారి ఇళ్లలోను, బంధువుల ఇంట్లోను వాకబు చేయగా అతని ఆచూకీ లభించలేదన్నారు. నరసింహమూర్తి ఆచూకీ తెలియక ఆందోళన చెందుతున్నామని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8179321595, 9848056465 సెల్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులకు కోరుతున్నారు.

వ్యాను బోల్తా

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని బొంతుపేట గ్రామ సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం బ్యాటరీలు లోడుతో విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న వ్యాన్ టైర్ పేలి జాతీయ రహదారిపై బోల్తాపడింది దీంతో బ్యాటరీలు, ఇన్వెర్టర్లు రహదారిపై చెల్లాచెదురుగా పడ్డాయి. జిల్లాలోని ప్రభుత్వ బిసి హాస్టల్‌కు సరఫరాలో భాగంగా జిల్లా కేంద్రానికి వెళ్తున్న క్రమంలో బోల్తా పడింది. డ్రైవర్, క్లీనర్‌తో పాటు ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వీరిని 108 సహాయంతో రణ స్థలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు హైవే సిబ్బంది వచ్చి రహదారిని ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేశారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

సోంపేట : సోంపేట పట్టణ శివారులోని కాలనీలో గురువారం సిఐ మంగరాజు ఆధ్వర్యాన డాగ్ స్క్వాడ్ ఇంటింటా సోదాలు నిర్వహించారు. ఇటీవల పట్టణ శివారులో గంజాయి చేతులు మారుతున్నాయని సమాచారం రావడంతో తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. జింకిభద్రలో సైతం పలు ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. గంజాయి వాడకం, విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని కోరారు.

విద్యార్థులతో హారికా ప్రసాద్

ఉత్సాహంగా చిన్నారుల చెస్ టోర్నీ

అరసవల్లి: చెస్ క్రీడపై విద్యార్థులు ఆసక్తి చూపడం అభినందనీయమని హారికా కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సలెంట్స్ అధినేత, లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం సెంట్రల్ అధ్యక్షులు హారికా ప్రసాద్ అన్నారు. నగరంలోని ఇలిసిపురంలో గల తిలక్‌నగర్ నర్సెస్ కాలనీలో గల స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీలో హారికా కన్‌స్ట్రక్షన్స్ అండ్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెస్‌టోర్నీని నిర్వహించారు. పలు ప్రాంతాల్లోని వివిధ స్కూళ్ల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హారికా ప్రసాద్ మాట్లాడుతూ చదరంగం క్రీడ మేధావుల క్రీడని, అలాంటి క్రీడలో జిల్లాలో చిన్నారులు పాల్గొని నేర్చుకోవడం, పోటీలో రాణి స్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం ఇంజినీర్ నిహార్ చందకతో కలిసి విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ ఛీఫ్ కోచ్ భేరి చిన్నారావు, చెస్‌కోచ్ కె.సాయినిరంజన్ సింగ్, పలువురు సీనియర్ చెస్ క్రీడాకారులు, తల్లితండ్రులు పాల్గొన్నారు. టోర్నీ విజేతగా మంగరాజు శేషాద్రి పట్నాయిక్ సత్తాచాటగా, రన్నరప్‌గా బలివాడ జయంత్ 2వ స్థానంలో, ఉరిటి లిఖిత్ శ్రీహర్ష 3వ స్థానంలో నిలిచారు.

కమిషనర్ పర్యటన

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని ఎర్ర చెరువు గట్టుపై చెత్తలు వేయకుండా ఉండేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు సిబ్బందికి ఆదేశించారు. రోజువారి శానిటేషన్ పరిశీలనలో భాగంగా గురు వారం కమిషనర్ 17వ వార్డు తిలక్ నగర్ రోడ్డులో, కాశీబుగ్గ 14వ వార్డు నిత్యానందనగర్‌లో పర్యటించారు. కాశీబుగ్గ సర్కిల్ పారిశుధ్య కార్మికుల మస్టర్ ఆఫీసులో హాజరుపట్టికను పరిశీలించారు. గాంధీ నగర్ 18వ, వార్డుకు సంబంధించి, అపార్ట్ మెంట్ నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్‌కు వచ్చిన దరఖాస్తు విచారణ నిమిత్తమై క్షేత్రస్థాయిలో ఆ స్థలాన్ని పరిశీలించారు. 9వ వార్డు రాధాకాంత చెరువు, పరిసర ప్రాంతాల్లోని పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. కాశీబుగ్గ 21వ వార్డు గాంధీనగర్ ఎస్‌బిఐఎస్ స్కూల్ రోడ్డులోని మేజర్ డ్రైన్‌ని పరిశీలించారు.